

నాంచారిమడూర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వెంకటాపురంలో మహిళలను కలిసి ఓటడుగుతున్న మంత్రి ఎర్రబెల్లి

# బీఆర్‌ఎస్‌తోనే పండుగలా వ్యవసాయం

- కరువు నేలను కోనసీమలా మార్చిన సీఎం కేసీఆర్
- ఇంటింటికీ అందిన సంక్షేమ పథకాలు
- పాలకుర్తి నియోజకవర్గంలో వందల కోట్లతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు
- డబ్బుతో గెలుస్తామనే అహంకారంలో కాంగ్రెస్
- ప్రజల కష్ట సుఖాల్లో తోడు నడిచిన నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



నాంచారిమడూర్‌లో దివ్యాంగుడితో ఎర్రబెల్లి

తొర్రూరు, నవంబర్ 18 : కరువుతో నెర్రెలు బారిన నేలను సస్యశామలం చేసి బీడు భూములకు సాగునీరందించిన ఈ ప్రాంతాన్ని కోనసీమలా మార్చిన సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మార్చారని బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో వందల కోట్ల నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన తనను పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తొర్రూరు మండలం గుడిబండ తండా, నాంచారిమడూర్, పెద్దమంగ్యాతండా, టీక్యాతండా, వెంకటాపురం, అమర్‌సింగ్‌తండా, దుబ్బతండా, హరిపిరాల, కర్కాల గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. ఒకప్పుడు కరువుతో అల్లాడే ఈ ప్రాంతం నేడు జలకళతో పచ్చటి పైర్లతో కళకళలాడుతోందని, దీనికి సీఎం కేసీఆర్ కారణం కాదా ఆలోచించాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ద్వారా వచ్చే నీటితో పాలకుర్తి నియోజకవర్గంలో లక్షా 15 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయని, వేసవిలో కూడా చెరువులు నిండి మత్తళ్లు పోస్తున్నాయని తెలిపారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేయడంతో పాటు రైతు పండించిన ధాన్యాన్ని, మక్కలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నదని ఎర్రబెల్లి తెలిపారు. ఒక మోటర్‌కు ఏటా కనీసం లక్ష రూపాయల విద్యుత్ బిల్లు వస్తుందని, ఇదంతా ప్రభుత్వానికి భారమైనా రైతులకు న్యాయం చేయాలని సీఎం కేసీఆర్ వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలను ప్రజలు నమ్మొద్దని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్‌కు మించి రాదని ఆయన వివరించారు.

### ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నా..

పాలకుర్తి నియోజకవర్గంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నామని మంత్రి ఎర్రబెల్లి వివరించారు. నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, స్టడీమెటీరిల్ పంపిణీ, కరోనా కాలంలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, నిత్యావసర సరుకులు, ఆనందయ్య మందు అందజేసినట్లు గుర్తుచేశారు. ఎంతో మంది బాధితులకు నేరుగా ఆసుపత్రుల్లో సహాయం అందించానన్నారు. కానీ ఈ ప్రాంతానికి ఎంతో చేశానని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు కరోనా కాలంలో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. యువతకు, అవసరార్థుల కోసం కోట్లు వెచ్చించి డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఉపాధి కూలీలకు కిట్లు అందజేశామన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని ఊరూరా కుట్టు శిక్షణ ఇప్పించి ఉచితంగా మిషన్లు అందజేయడమే కాకుండా వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో ప్రతిభ ఆధారంగా రూ.15 వేల వరకు సమకూర్చుకునేలా వందలాది ఉద్యోగాలు కల్పించబోతున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లో కోతుల బాధ లేకుండా కార్యాచరణ చేపట్టామన్నారు. కష్టకాలంలో మీ వెంట ఉన్న దయన్నను కాపాడతారా.. లేదంటే అమెరికా నుంచి సూట్ కేసుల్లో డబ్బులు తెచ్చి ఓట్లు కొనాలని చూస్తున్న కాంగ్రెస్ వాళ్లని కాపాడతారా..? మీరే ఆలోచించుకోవాలని ప్రజలను కోరారు. కేవలం ఎన్నికలప్పుడు వచ్చి తర్వాత వెళ్లిపోయే వలస పక్షులను పట్టించుకోవద్దన్నారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### భారీ మెజార్టీతో గెలిపించాలి : సుధాకర్‌రావు

పాలకుర్తి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి ఊరూరికి సాగు నీరు, ఇంటింటికీ తాగునీరు అందించేలా కృషి చేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావును ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్ రావు పిలుపునిచ్చారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌ను నమ్మొద్దన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే పేదలందరికీ వ్యక్తిగత బీమాతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15 లక్షల వరకు వైద్య చికిత్స అందించేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని సుధాకర్‌రావు తెలిపారు.

### రియల్ ఎస్టేట్ వ్యాపారుల మద్దతు..

పాలకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు తొర్రూరు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు మద్దతు తెలిపారు. శనివారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో దయాకర్‌రావును కలిసి ఈ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వెంకటాపురం ప్రచారంలో పాల్గొన్న కడియం శ్రీహరి

## కొట్లాడితేనే తెలంగాణ వచ్చింది

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ఇవ్వలేదు
- కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ల్యాండ్ పూలింగ్ చేయనివ్వమని హామీ
- అవకాశం ఇవ్వండి.. ఆదర్శంగా తీర్చిదిద్దుతా..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

ఐనవోలు, నవంబర్ 18 : 'కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వలేదని, కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడి తెలంగాణ సాధించుకున్నామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని వెంకటాపురంలో ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించి వెంటనే తెలంగాణ ఇస్తే మన బిడ్డలు చనిపోయేవారు కాదని, జాప్యం చేశారు కాబట్టే వందలాది మంది అత్మబలిదానాలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన బిడ్డల ఆత్మబలిదానాలకు కాంగ్రెస్ నాయకులే సమాధానం చెప్పాలన్నారు. కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ల్యాండ్‌పూలింగ్ చేయనివ్వమని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించండి. మీరు కోరిన పనులన్నింటినీ ఆరు నెలల్లో పూర్తి చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీకి ఎన్నికల మీదే యావ ఉన్నదని, పేద ప్రజల కోసం పథకాలను కొనసాగించాలనే అలోచన లేదన్నారు. రైతుబంధు, దళిత బంధు, రైతు రుణ మాఫీతో పేదలకు లబ్ధి జరుగుతుంటే ఆ పార్టీలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. ఈ పథకాలను ఆపాలని కాంగ్రెస్, బీజేపీ నాయకులు చూస్తున్నారని, ప్రజలే ఆలోచన చేయాలన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే వారికి ప్రజలు గుర్తుకు వస్తాయని, బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాష్ట్ర సంపదను పెంచి ప్రజలకు పంచాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో రాబోయే 5 ఏళ్లలో రైతుబంధును రూ.16వేలు, ఆసరా పింఛన్ రూ.5 వేలు, మహిళలకు సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.3 వేలు, రూ.400లకే ప్రతి ఇంటికీ గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మాదాసు వెంకటేశ్, జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కర్ణాకర్, మండలాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఎంపీపీ మార్నేని మధుమతి, ఎంపీటీసీ పిండి మాధవి, సర్పంచ్ గోరె రేణుక, గ్రామ అధ్యక్షుడు రామారావు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదుకున్న వారిని ఆదరించండి

- ఇదే జోష్‌తో పని చేయండి
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్




మడికొండ : రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్, పక్కన ఎంపీ దయాకర్, మేయర్ సుధారాణి

హనుమకొండ, నవంబర్ 18 : అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని వరంగల్ పశ్చిమ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఇంటీరియర్ డిజైనర్స్ లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి కూలీలుగా పనిచేస్తున్న కార్మికులందరూ తన ఇంటి వాళ్లన్నారు. రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం కోసం పలు పథకాలను అందించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఎంతోకాలంగా ఇక్కడ ఉంటున్న వీరి సమస్యల్లో కొన్ని పరిష్కారమయ్యాయన్నారు. మే నెలలో కార్మిక మాసోత్సవం నిర్వహించి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి దిశగా పని చేశానని చెప్పారు. కార్మికుల పిల్లల విద్య, వైద్యానికి సహాయ సహకారాలు అందించానని తెలిపారు. లేబర్ కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను కూడా ఇప్పించానని, జనవరిలో హెల్త్ క్యాంపులు నిర్వహించి మిగతా వారికీ హెల్త్ కార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. ఎటువంటి ఆపద వచ్చినా, దాస్యం అండగా ఉన్నాడని చెప్పాలన్నారు. కరోనా సమయంలో ఏ పార్టీ పట్టించుకోకున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వలస కార్మికులను సొంత మనుషుల్లా అక్కున చేర్చుకుని, రవాణా సౌకర్యం, భోజన వసతి కల్పించారని పేర్కొన్నారు. సుమారు 1500 మంది స్వచ్ఛందంగా వచ్చి మద్దతు తెలుపడం ఆనందంగా ఉందని తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణ పునర్నిర్మాణ కార్యకర్తలు అని అన్నారే తప్ప, కార్మికులు అని ఎపుడు సంబోధించలేదన్నారు. ఈ దఫా 50 వేలకు పైచిలుకు భారీ మెజార్టీతో గెలువడంతో పాటు ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సిద్ధిక్, సోను, సహిద్, సలీం, బాబా, ఆజాద్, సాజిద్ అలీ, అనూప్, వహీద్, సందీప్, మనోజ్, మున్నీలాల్, శిబు పాల్గొన్నారు.

### అభివృద్ధికి పట్టం కట్టండి...

కాజీపేట : పశ్చిమ నియోజకవర్గంలో గతంలో చేసిన అభివృద్ధి, సేవలను చూసి ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి పట్టం కట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్, పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. వడ్డేపల్లి ట్యాంక్ బాండ్‌పై వాకర్స్‌ను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు కృషి చేశానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటూ పరిష్కరించానన్నారు. కార్యక్రమంలో 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు, డివిజన్ అధ్యక్షుడు కుమ్మరి కోటిలింగం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లేపల్లి రాజేశ్, సారయ్య, కొండ్ర శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మడికొండలో..

మడికొండ : అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని దాస్యం తెలిపారు. 63వ డివిజన్‌లో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొలుత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంటగ్యాస్ రూ.400లకే అందించనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు ఉన్న పేదలందరికీ సన్నబియ్యం అందిస్తామన్నారు. అలాగే పేదలకు రూ.5లక్షల బీమా సౌకర్యం కూడా కల్పించనున్నట్లు చెప్పారు. ఎంపీ దయాకర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. మేయర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన రైల్వే రిటైర్డ్ టీసీ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బెదరకోట రంజిత్ కుమార్, ఇన్‌చార్జి మిట్టపల్లి రవీందర్, నాయకులు ఎండీ సోని, షేక్ మహమూద్, బరిగెల వినయ్, నాగవల్లి శ్రీధర్, విష్ణుమూర్తి, చిలువేరు మహేశ్, మాతంగి మోహన్, శేఖర్, బండి రామచందర్, ఓంకార్, అయినవోలు ప్రవీణ్ కుమార్ శర్మ పాల్గొన్నారు.